# ప్రతిష్ఠాత్మకంగా డాలస్ సభ

**తెలంగాణ కళ, సాంస్కృతిక వైభవం చాటిచెప్పేలా ఏర్పాట్లు • యూఎస్ అంతటా డాలస్ సభపై ఆసక్తి : మహేశ్ బిగాల**

- వాట్సాప్ మెసేజ్ పెట్టిన తొలిరోజే 5 వేల రిజిస్ట్రేషన్లు
- విదేశాల్లో నిర్వహిస్తున్న తొలి పెద్ద సభ ఇదే
- తరువాత ఇతర దేశాల్లోనూ రజతోత్సవాలు నిర్వహిస్తాం
- బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): డాలస్ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై విభాగం కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల పేర్కొన్నారు. అమెరికాలోని డాలస్ నగరంలోని డాక్టర్ పెప్పర్ ఎరినాలో జూన్ 1న బీఆర్ఎస్ రజతోత్సవ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో విదేశాల్లో ఉన్న తెలంగాణ బిడ్డల భవిష్యత్ కార్యాచరణకు డాలస్ మీటింగ్ దోహదం చేస్తుందని, ఇదొక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ మీటింగ్‌కు మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పలువురు పార్టీ నేతలు హాజరవుతారని చెప్పారు. బీఆర్ఎస్ రజతోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న డాలస్ మీటింగ్ విశేషాలు, ఏర్పాట్లపై ఆయన 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.



**నమస్తే తెలంగాణ: డాలస్ మీటింగ్‌కు బీఆర్ఎస్ గ్లోబల్ సెల్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు కనిపిస్తున్నది. అందుకు ఏవైనా ప్రత్యేక కారణాలున్నాయా?**

**మహేశ్ బిగాల:** ప్రాధాన్యం అంటూ ప్రత్యేకంగా ఏమీలేదు. బీఆర్ఎస్ పార్టీ గ్లోబల్ వింగ్ తొలిసారిగా తెలంగాణ బయట అదీ అమెరికాలో నిర్వహిస్తున్న పెద్ద మీటింగ్ కావడంతో మాలో మాకు కొత్త ఉత్సాహం వస్తున్నది. ఇప్పటిదాకా మేం అకేషనల్లీ గ్యాదరింగ్స్ చేశాం. ఇది పెద్ద మీటింగ్. బీఆర్ఎస్ పార్టీకి అనేక విభాగాలున్నాయి. అందులో ఒకటి గ్లోబల్ వింగ్. మిగతా వింగ్‌లు వాటి సందర్భాల్లో కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ఆ మాటకొస్తే మేమూ కొన్ని తెలంగాణలో చేస్తాం. మరికొన్ని మేము ఉంటున్న దేశాల్లో చేస్తాం. పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను సంవత్సరం పొడవునా నిర్వహించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించిన నేపథ్యంలో, ఎన్నారై వింగ్ కూడా సంవత్సరం పొడవునా కార్యక్రమాలను నిర్వహించాలనుకున్నాం. ఇదే విషయాన్ని పార్టీ అధినేత కేసీఆర్‌కు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చెప్పాం. వారు సరేనన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్నవాళ్లం అనేక విధాలుగా ప్రయత్నాలు చేశాం. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే కాకుండా తెలంగాణ అభివృద్ధి జరగాలని కలలుకన్నాం. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర సాధన ఉద్యమంలో భావగస్వామ్యం అయ్యాం. పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్ని రంగాల్లో తెలంగాణ ప్రగతిని సాధించింది. ప్రస్తుతం తెలంగాణలో మళ్లీ పూర్వ పరిస్థితులే కనిపిస్తున్నాయనే ఆందోళన నెలకొన్నది. ఇటువంటి సమయంలో మరోసారి మన తెలంగాణ బాగు కోసం మనం ఏంచేయాలన్నదే మా ఆలోచన. ఇది ఒక్క బీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా ఉన్న ఎన్నారై విభాగమే కాకుండా అన్ని వేదికల్లో ఉన్న తెలంగాణ బిడ్డలది. తెలంగాణ మళ్లీ ఇబ్బందులకు గురికావద్దన్నదే మా ఆలోచన. కన్నపేగును కష్టపెట్టకుండా ఉండేందుకు మాకు మేముగా ఏం చేయాలి? అని ఆలోచిస్తున్నాం. మా తరువాతి తరం ఆగం కావద్దన్నదే మా ఆలోచన. అందుకోసం ఒక ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలని భావిస్తున్నాం. అందుకోసం డాలస్ మీటింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా చూస్తున్నాం.

**నమస్తే తెలంగాణ: మీటింగ్ ఏర్పాట్లు ఎలా సాగుతున్నాయి? ఫీడ్‌బ్యాక్ ఎలా ఉన్నది?**

**మహేశ్ బిగాల:** రెస్పాన్స్ చాలా బాగున్నది. స్వచ్ఛందంగా ఎవరికివారు పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నరు. అయితే, ముందు చిన్న హాల్‌లో సభ పెట్టాలనుకున్నాం. అమెరికాలో ఆయా స్టేట్స్‌లో ఉన్న తెలంగాణ బిడ్డల నుంచి వస్తున్న రెస్పాన్స్‌ను చూసి వేదికను మార్చాం. డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరినాను ఫైనల్ చేశాం. అమెరికాలోని దాదాపు అన్ని స్టేట్స్‌లో ఉన్న మనవాళ్లు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. మీటింగ్‌కు వచ్చేవాళ్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఒక్క వాట్సాప్ మెసేజ్ పెడితే ఒక్కరోజులోనే ఐదారువేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మీటింగ్‌కు వచ్చేవాళ్ల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. సన్నాహక సమావేశాలు కూడా అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాం. యూఎస్‌ఏ బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై సెల్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ మహేశ్ తన్నీరుతోపాటు స్థానికంగా ఉన్నవాళ్లతో కలిసి సమన్వయం చేస్తున్నాం. కళ, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు తెలంగాణ నుంచి వస్తున్నారు. గోరటి వెంకన్న, రసమయి బాలకిషన్, మధుప్రియ, రేలారే గంగ తదితరులు హాజరవుతున్నారు. బతుకమ్మ, కోలాటంతోపాటు చేనేత వస్త్రాలను ప్రమోట్ చేసే కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది. తెలంగాణతల్లి విగ్రహం, అమరవీరుల స్థూపం నమూనాను మీటింగ్ ప్రాంగణంలో ఏర్పాటుచేస్తున్నాం. తెలంగాణ నుంచి వచ్చే కళాకారులతోపాటు అమెరికాలోని వారు కూడా తమ కళను ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు. ఒక్కమాటలో చెప్పాల్నంటే డాలస్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను వెల్లువలా ప్రదర్శించేందుకు అనేకమంది ఉత్సాహం చూపుతున్నారు. వారి కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాం.

**నమస్తే తెలంగాణ: పార్టీ ఎన్నారై విభాగంతోపాటు తెలంగాణ నుంచి నాయకులెవరైనా వస్తున్నారా?**

**మహేశ్ బిగాల:** డాలస్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారు. పార్టీ రజతోత్సవాల మీటింగ్‌ను మొదటిసారి బయటి దేశంలో నిర్వహిస్తున్నాం కాబట్టి, మాకు సహాయం చేసేందుకు, సన్నాహక సమావేశాలను సమన్వయం చేసేందుకు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు ఇలా దాదాపు 25 నుంచి 30 మంది వరకు వస్తామని చెప్పారు. ఇప్పటికే కొంతమంది వచ్చారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్, క్రాంతికిరణ్ చంటి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్దిరెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు తదితరులు వస్తున్నారు. వీరిలో కొందరు ఇప్పటికే వచ్చి మాకు సహకారం అందిస్తున్నారు.

**నమస్తే తెలంగాణ: డాలస్ మీటింగ్‌కు ఎవరెవరు హాజరవుతున్నారు?**

**మహేశ్ బిగాల:** తెలంగాణ వాళ్లే కాకుండా అనేకమంది తెలుగువాళ్లు మీటింగ్‌కు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. తానా, ఆటాల్లోని తెలంగాణ వాళ్లు, ఏ సంస్థల్లోనూ సభ్యులు కాని వాళ్లు, లోకల్ ఆర్గనైజేషన్స్‌లో భాగస్వామ్యులైనవాళ్లు వస్తున్నారు.

**నమస్తే తెలంగాణ: పార్టీ రజతోత్సవాలను డాలస్‌తో పాటు మరెక్కడైనా ప్లాన్ చేశారా?**

**మహేశ్ బిగాల:** రజతోత్సవాల నేపథ్యంలో సంవత్సరం పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని అనుకున్నాం. అందులో మొదటిది డాలస్. తరువాత యూరప్ దేశాల్లో ఉన్న బీఆర్ఎస్ ఎన్నారై విభాగం కోసం లండన్‌లో, ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాల్లో ఉన్నవారి కోసం సౌత్ ఆఫ్రికాలో, గల్ఫ్‌దేశాల్లో ఉన్నవారి కోసం గల్ఫ్‌లో, మలేషియా ఇలా పలు ప్రాంతాల్లో నిర్వహించాలని అనుకుంటున్నాం.

---



నందనం నీరా ప్రాజెక్టును పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, పల్లె రవికుమార్‌గౌడ్

## నీరా ప్రాజెక్టును గౌడన్నలే తెరుస్తరు!

- 2లోగా సర్కారు స్పందించక పోతే.. తర్వాత జరిగేది అదే
- హైదరాబాద్‌లోని నీరాకేఫ్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి
- సర్కారుకు మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన నీరాకేఫ్‌ను జిల్లాలకు విస్తరించాల్సింది పోయి, పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన కేఫ్‌ను కాంగ్రెస్ సర్కారు ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పాలని చూడడం దారుణమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే టెండర్లు రద్దు చేసి, కల్లుగీత కార్పొరేషన్ ద్వారానే కేఫ్‌ను నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీరాకేఫ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే కల్లు దుకాణంగా మారుతుందని, కల్తీ జరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంచేశారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్‌తో కలిసి ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలోని నీరా ఉత్పత్తుల కేంద్రాన్ని శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు, గౌడ్‌ల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం నీరాకేఫ్, నందనం నీరా ఉత్పత్తుల కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రాజెక్టును అన్ని హంగులతో పూర్తిచేసినా ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభించలేకపోయామని చెప్పారు. ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరగా పట్టించుకోకపోవడంతో యంత్రాలు తుప్పుపడుతున్నాయని తెలిపారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి తక్షణమే నందనం ప్రాజెక్టును సందర్శించి, జూన్ 2వ తేదీలోగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకపోతే గీతకార్మికులే ప్రారంభించుకుంటారని తేల్చిచెప్పారు.

### 'ధర్మ భిక్షం' పేరు పెట్టాలి

ప్రభుత్వం నందనంలోని నీరా ప్రాజెక్టుకు 'ధర్మ భిక్షం' పేరు పెట్టాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో 'ధర్మ భిక్షం నామకరణం చేయాలని భావించామని, కానీ ఎన్నికల్ కోడ్ వల్ల ప్రక్రియ ముందుకు సాగలేదని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ గీతకార్మికుడికి సేఫ్టీకిట్‌లు పంపిణీ చేయాలని, వైన్‌షాప్‌లలో గౌడ్‌లకు ఇస్తున్న 15 శాతం రిజర్వేషన్‌ను 25కు పెంచాలని, జనగామ జిల్లాకు సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌గౌడ్ వెంట మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, సర్పంచుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, జిల్లా గౌడ సంఘం నాయకుడు అతికం లక్ష్మీనారాయణగౌడ్, జనగాం పాండు, బీఆర్ఎస్ భువనగిరి మండల అధ్యక్షుడు ఓంప్రకాశ్‌గౌడ్, జనరల్ సెక్రటరీ రమేశ్, మాజీ ఎంపీటీసీ కిరణ్, బీఆర్ఎస్ భువనగిరి పట్టణ అధ్యక్షుడు అజీమ్, మాజీ కౌన్సిలర్ ధనుంజయ్, జిల్లా నాయకుడు ప్రభాకర్, స్థానిక సర్పంచ్ రాఘవేంద్ర రెడ్డి ఉన్నారు.

---



అక్రమ అరెస్టులను ఖండిస్తూ పెద్దమందడి పీఎస్ ముందు బీఆర్ఎస్ నేతల నిరసన

## బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తిలో బైక్ ర్యాలీ
- పెద్దమందడిలో బీఆర్ఎస్ నేతలు, పార్టీ శ్రేణుల ఆందోళన

వనపర్తి టౌన్, మే 25 : పెద్దమందడిలో బీఆర్ఎస్ మీడియా సెల్ నాయకులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లికి చెందిన సురేశ్, జంగమాయిపల్లికి చెందిన కొండన్నను ఎస్సై శివకుమార్ అక్రమంగా స్టేషన్‌లోనే నిర్బంధించడాన్ని నిరసిస్తూ ఆదివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహం నుంచి రాజీవ్‌చౌక్, కొత్త బస్టాండ్ మీదుగా ఎస్పీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎస్పీ రావుల గిరిధర్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ మాట్లాడుతూ.. పెద్దమందడి మండలంలో స్థానిక గ్రూపుల్లో సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ శ్రేణులు వ్యక్తిగత దూషణలు చేయగా బీఆర్ఎస్ కార్యకర్తలు దానికి సమాధానాలు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. పోలీసులు అధికార పక్షానికి వత్తాసు పలుకుతూ బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులుపెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలకు పాల్పడిన వారెవరైనా ఉపేక్షించవద్దని, పోలీస్ సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల అక్రమ అరెస్టులను నిరసిస్తూ పెద్దమందడి పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. అంతకుముందు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేశారు.

---

# చౌమహల్లా విందులోనే మిస్ బిహేవ్?

మొదటిపేజీ తరువాయి...

సంస్థలు కూడా ఆసక్తిని కనబరిచినట్టు తెలిసింది. అధికారిక, అనధికారిక ఒప్పందం అని రెండు షరతులను కొందరు అధికారులు పెట్టడంతో వాణిజ్యసంస్థలు స్పాన్సర్‌షిప్‌ను చేయటానికి నిరాకరించినట్టు తెలుస్తున్నది. అందాల పోటీలు ముగింపు దశలకు వచ్చినప్పటికీ స్పాన్సర్స్ ముందుకు రానట్టు సమాచారం. దీంతో చౌమహల్లా ప్యాలెస్‌లో విందు ఏర్పాటుచేసి ప్రముఖులను ఆహ్వానించి స్పాన్సర్‌షిప్ రాబట్టాలని వేసిన ప్రణాళిక ఇప్పుడు వివాదాస్పదమైంది.

### 300 మందికి ఆహ్వానం

భారత్-పాక్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో తొలుత రాష్ట్ర ప్రభుత్వం తరపున అందాలభామలకు ఇచ్చే విందును రద్దు చేసినట్టు సచివాలయ వర్గాలు ప్రకటించాయి. కానీ అధికారులు అగమేఘాల మీద మళ్లీ విందు ఏర్పాట్లు చేశారు. ప్రముఖుల పేరుతో 300 మందిని ఆహ్వానించారు. వీరిలో బిజినెస్, నిర్మాణరంగం, స్థిరాస్తి వ్యాపారం, సినిమా, ఫార్మా, హోటల్, మెడికల్, రాజకీయ రంగాలకు చెందిన వారున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలు కూడా ఉన్నారు. స్పాన్సర్స్ కోసమే చౌమహల్లా ప్యాలెస్‌లో కొందరు అధికారులు విందు ఏర్పాటుకు ప్లాన్ చేసినట్టు తెలుస్తున్నది. ఒక్కో అతిథి రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు స్పాన్సర్‌షిప్ నిధులు సేకరించాలని అధికారులు ఆలోచించినట్టుగా విశ్వసనీయవర్గాల సమాచారం.



### ఈజీ ఈవినింగ్.. ఫ్రీ టు మింగిల్?

చౌమహల్లా ప్యాలెస్ విందుకు వివిధ రంగాల ప్రముఖులు, ధనవంతులు హాజరైన తర్వాత జరిగిన పరిణామాలు విమర్శలకు దారితీస్తున్నాయి. విందు నిర్వాహకులు అతిథులందరినీ సాదరంగా టేబుల్స్ వద్ద కూర్చోబెట్టారు. ఒక్కో టేబుల్ వద్ద ఆరుగురు వీఐపీలు కూర్చునే వీలు కల్పించారు. ఆరుగురు ప్రముఖులు కూర్చున్న చోట ఇద్దరు సుందరీమణులను కూర్చోబెట్టినట్టు సమాచారం. ఆ సమయంలో ప్రభుత్వ ఉన్నతాధికారి మాట్లాడుతూ అతిథులతో అందాల భామలు మాట్లాడాలని, ఒకరినొకరు పరిచయం చేసుకోవచ్చని (డియర్ గర్ల్స్ అండ్ జెంటిల్‌మెన్, దిస్ ఈజ్ ది ఈజీ ఈవినింగ్. యూ ఆల్ ఫ్రీ. యూ ఆర్ ఫ్రీ టు మింగిల్ ఇఫ్ సమ్‌వన్ క్యాచెస్ యువర్ ఐ.. యూ కెన్ గో అండ్ టాక్ టు దెమ్. యూ కెన్ షేర్ యువర్ ఒపీనియన్స్. యూ కెన్ టేక్ సెల్ఫీ అండ్ ఫొటోస్. ఇట్ కెన్ బీ యాజ్ యూ లైక్) ప్రకటన చేశారు. కొందరు వీఐపీలు వివిధ దేశాల సుందరీమణుల వద్దకు వెళ్లి, ఫొటోలు, సెల్ఫీలు దిగారు. కానీ మరికొందరు హద్దుమీరి ప్రవర్తించినట్టు తెలుస్తున్నది. అధికార పార్టీ నేత ఒకరు ఓ దేశ సుందరి వద్దకు వెళ్లి అనుచితంగా ప్రవర్తన కనబర్చినట్టు సమాచారం. తీవ్ర అసహనానికి గురైన సదరు యువతి.. పక్కనే ఉన్న అధికార పార్టీకి చెందిన మహిళా నాయకురాలికి ఫిర్యాదు చేయగా, ఆమెకు భాష అర్థంకాక పట్టించుకోనట్టు తెలిసింది. ఆ నాయకుడు ఎవరు? బాధిత అందాలభామ ఎవరనే విషయంపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

### అందాల భామలతో బ్రాండ్ల ప్రమోషన్?

మిస్‌వరల్డ్ సంస్థ నిర్వాహకులు పోటీదారులకు ఇచ్చిన షెడ్యూలులో లేని కార్యక్రమాలను చేర్చినట్టు తెలుస్తున్నది. కంటెస్టెంట్లు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనేలా నిర్వాహకులు ఒత్తిడి చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. చిన్నచిన్న వ్యాపారులతో రూ.5 లక్షలు, రూ.10 లక్షలు పారితోషికం మాట్లాడుకొని కంటెస్టెంట్లను ఆయా కార్యక్రమాల ప్రమోషన్‌కు తీసుకెళ్లినట్టు తెలిసింది. కొన్ని ప్రైవేట్ సంస్థల బ్రాండ్లను ప్రమోట్ చేయడమే దీని ఉద్దేశమని చర్చ జరుగుతున్నది.

### మ్యాగీకి మద్దతు... నిర్వాహకులపై విమర్శలు

మిస్ వరల్డ్ కంటెస్టెంట్లను వారి ఈవెంట్స్‌కు పరిమితం చేయకుండా ఇతర కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయడమేంటని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. షెడ్యూల్‌ను ఫాలో కాకుండా స్పాన్సర్స్ కోసమో, ప్రచారం కోసమో వారిని వివిధ ప్రాంతాలకు తిప్పడమేంటని నిలదీస్తున్నారు. ప్రభుత్వం, నిర్వాహకులు, అధికారుల తీరు వల్ల తెలంగాణతోపాటు దేశ ప్రతిష్ఠను దెబ్బదీశారని మండిపడుతున్నారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు వివిధ దేశాలకు ప్రతినిధులు అనే విషయాన్ని మర్చిపోయి, గల్లీ లీడర్లను సైతం అనుమతిస్తే వారు బంధువులు, స్నేహితులతో కలిసి ఫొటోలు తీసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్లే మిల్లా మ్యాగీ కూడా 'మంకీ షో' వంటి కామెంట్స్ చేశారని గుర్తుచేస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ లోపంతో హైదరాబాద్ పేరును అభాసుపాల్జేశారని మండిపడుతున్నారు.

---



## నీతి ఆయోగ్ మీటింగ్‌కు వెళ్లడంలో మర్మమేంటి?

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సూటి ప్రశ్న

హైదరాబాద్ మే 25 (నమస్తే తెలంగాణ): నీతి ఆయోగ్ గత సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు పోజులు కొట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు వెళ్లారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ప్రశ్నించారు. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితుల్లో వచ్చిన మార్పేంటని ఆదివారం ఎక్స్ వేదికగా నిలదీశారు. నేషనల్ హెరాల్డ్ కేసు చార్జిషీట్‌లో రేవంత్ పేరు ఉన్న నేపథ్యంలో ప్రధాని మోదీని ప్రసన్నం చేసుకొనేందుకే వెళ్లినట్టు భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. కాగా, నీతి ఆయోగ్ మీటింగ్‌ను బహిష్కరిస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియో, శనివారం ప్రధాని మోదీతో కరచాలనం చేస్తున్న ఫొటోను కేటీఆర్ ట్యాగ్ చేశారు.

## మిస్ ఇంగ్లండ్ మ్యాగీ ఆరోపణలు అవాస్తవం

- ఎవరూ తప్పుగా ప్రవర్తించ లేదు
- ది సన్ పత్రికకు క్రెడిబిలిటీ లేదు
- పర్యాటకశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ప్రకటన



హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీతో ఎవరూ తప్పుగా ప్రవర్తించలేదని, ఆమె ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ స్పష్టంచేశారు. మ్యాగీ 8 రోజులు మాత్రమే ఇక్కడ ఉన్నారని చెప్పారు. ఆమె ఆరోపణల నేపథ్యంలో మిస్ వరల్డ్ నిర్వాహకులతోపాటు పోటీదారులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నానని చెప్పారు. తాను కూడా కొన్ని ఈవెంట్లలో పాల్గొన్నానని, ఆమె ఆరోపించినట్టుగా అలాంటి పరిస్థితి ఎదురయ్యే అవకాశాలు కనిపించలేదని స్పష్టం చేశారు. తమకు ఎక్కడా ఇబ్బంది ఎదురుకాలేదని పోటీదారులందరూ చెప్పారని తెలిపారు. చౌమహల్లా ప్యాలెస్‌లో జరిగిన విందులో మిస్ ఇంగ్లండ్‌తోపాటు మిస్ వేల్స్ కూడా అదే టేబుల్ వద్ద ఉన్నారని పేర్కొన్నారు. ప్రతీ టేబుల్ వద్ద పురుషులు, మహిళలు ఉన్నారని చెప్పారు. అక్కడ తమతో ఎవరూ తప్పుగా ప్రవర్తించలేదని మిస్ వేల్స్ చెప్పారని వివరించారు. సెల్ఫీల కోసం ఎక్కువ మంది ప్రయత్నించడం మాత్రమే కొంత ఇబ్బందిగా ఉన్నదని కంటెస్టెంట్లు చెప్పారని తెలిపారు. మ్యాగీ ఆరోపణలపై మిస్ వరల్డ్ నిర్వాహకులు యూకేలో విచారణ జరుపుతున్నట్టు చెప్పారు. ఆమె ఆరోపించినట్టుగా ఏమీ జరగలేదని, ఆ వార్త ప్రచురించిన మ్యాగజైన్‌కు అంత క్రెడిబిలిటీ కూడా లేదని చెప్పారు. ఆ టాబ్లాయిడ్‌లో వచ్చే కొన్ని రకాల ఫొటోల కోసమే కొందరు దానిని కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. మ్యాగీ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పారు. 31న జరగనున్న ఫైనల్‌పైనే దృష్టి పెట్టామని జయేశ్ వివరించారు.

---

## 'మిస్ బిహేవ్'పై అంతర్గత విచారణ?

- సర్కార్‌కు నివేదిక అందజేత!

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): ఇంగ్లండ్ సుందరి మిల్లా మ్యాగీకి ఎదురైన పరాభవంపై తెలంగాణ ప్రభుత్వం విచారణ చేపట్టింది. సీనియర్ ఐపీఎస్ అధికారి శిఖాగోయల్, ఐపీఎస్ అధికారి రెమా రాజేశ్వరి, సైబరాబాద్ డీసీపీ సాయిశ్రీ ఆధ్వర్యంలో ఎంక్వయిరీ చేశారు. మిస్ వరల్డ్ పోటీదారులను అడిగి పోటీల నిర్వహణ తీరు, ఇబ్బందులేమైనా ఎదురవుతున్నాయా? మ్యాగీ ఆరోపణల్లో నిజమెంత?అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీడియోలను సైతం రికార్డు చేస్తున్నారు. ఆమె పాల్గొన్న డిన్నర్‌లో ఎవరెవరు ఉన్నారు? ఆరోజు ఆమెతో కూర్చున్న వారి పేర్లతో పాటు పూర్తి వివరాలతో కమిటీ ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి విచారణ వివరాలను అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. పోటీదారులతోపాటు మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ వివరాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. మ్యాగీ చేసిన ఆరోపణలను మోర్లే ఖండించారు.

## మునిగిన నౌకలో ప్రమాదకర రసాయనాలు!

- కేరళలో హై అలర్ట్

కొచ్చి, మే 25: లైబీరియాకు చెందిన భారీ నౌక 'ఎంఎస్‌సీ' కేరళ తీరంలో నీట మునిగింది. దీంతో తీరం వెంబడి పెద్ద మొత్తంలో చమురు, ఇతర రసాయనాలు లీక్ అయ్యే ప్రమాదముందని కేరళ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించింది. ముఖ్యంగా మత్స్యకారులు ఎవ్వరూ సముద్రంలోకి వెళ్లరాదని, చేపలవేట చేపట్టరాదని హెచ్చరికలు జారీచేసింది. నౌకలో 640 కంటెయినర్లు ఉండగా, 13 కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు, 12 కంటెయినర్లలో కాల్షియం కార్బైడ్ ఉన్నట్టు పేర్కొంది.

---

## మహిళను గౌరవించే చోటే అవమానమా?

- మిస్ ఇంగ్లండ్ ఆరోపణలతో ప్రపంచదేశాల్లో మసకబారిన తెలంగాణ పరువు
- నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి
- త్వరలోనే హెచ్చార్సీకి ఫిర్యాదు చేస్తాం
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే సునీత




మీడియాతో మాట్లాడుతున్న గొంగిడి సునీత, చిత్రంలో రజినీ సాయిచంద్

హైదరాబాద్ మే 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వేదికగా నిర్వహిస్తున్న అందాల పోటీల్లో విదేశీయురాలికి అవమానం జరగడం బాధాకరమని ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మహిళా నేత గొంగిడి సునీత పేర్కొన్నారు. తనను వ్యభిచారిణిలా, ఆటబొమ్మలా చూశారంటూ పోటీల నుంచి వైదొలిగిన మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ వ్యాఖ్యానించారని, మహిళలను గౌరవించే గడ్డమీద ఇలాంటి ఘటన జరగడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇదేనా మనం విదేశీ మహిళలకు ఇచ్చే గౌరవం.. వారిని గౌరవించే సంస్కారం? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మిస్ ఇంగ్లండ్‌ను అవమానించిన అందాల పోటీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పార్టీ అధిష్ఠానం అనుమతి తీసుకొని త్వరలోనే జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఆదివారం తెలంగాణభవన్‌లో రజనీ సాయిచంద్‌తో కలిసి మీడియాతో గొంగిడి సునీత మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ పోటీల పేరిట రేవంత్ సర్కారు నిర్వాకంతో ప్రపంచ దేశాల్లో తెలంగాణ పరువు మసకబారిందని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడం చేతగాని సీఎం రేవంత్‌రెడ్డి అందాల పోటీల ఈవెంట్లకు ఆరుసార్లు హాజరుకావడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. మిస్ వరల్డ్ పోటీల ప్రచారంలో మహిళా మంత్రులను విస్మరించి సీఎం, డిప్యూటీ సీఎం, టూరిజం శాఖ మంత్రి ఫొటోలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో కేటీఆర్ దక్షతతో ఫార్ములా-ఈ కార్ రేస్ ద్వారా రూ.700 కోట్లు పెట్టుబడులు సాధించామని గుర్తుచేశారు. అప్పుడు తప్పుబట్టిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు మాత్రం పెట్టుబడుల కోసం అందాల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పుకోవడం ఎంతవరకు కరెక్ట్ అని నిలదీశారు.

### కేసీఆర్ పాలనలో సముచిత గౌరవం

కేసీఆర్ పాలనలో మహిళలకు సముచిత గౌరవం లభించిందని గొంగిడి సునీత పేర్కొన్నారు. మహిళలకు ప్రత్యేకమైన బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేసిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. మన సంస్కృతీ, సంప్రదాయలను కాపాడేందుకు ఎంతగానో కృషి చేశారని చెప్పారు. విదేశాల్లోనూ మన సంస్కృతికి గౌరవం లభించిందని, ఆస్ట్రేలియా లాంటి దేశం బతుకమ్మను అధికారిక పండుగగా ప్రకటించిందని గుర్తుచేశారు. అభివృద్ధి చేయడం, అప్పులు కూడా తేవడం చేతగాని అసమర్థ కాంగ్రెస్ సర్కారు అందాల పోటీల నిర్వహణలోనూ విఫలమైందని విమర్శించారు. రజనీసాయిచంద్ సాయిచంద్ మాట్లాడుతూ.. మిస్‌వరల్డ్ పోటీల్లో ఓ విదేశీ మహిళను అమానించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై మహిళాలోకం స్పందించాలని కోరారు. మిస్ ఇంగ్లాండ్‌ను ఇబ్బందిపెట్టిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

---

## పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చూడండి

- ప్రతీ శనివారం ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సమావేశం ఏర్పాటు
- ఇండస్ట్రియల్, ఇన్వెస్ట్‌మెంట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి
- హ్యుందాయ్ ఆర్‌అండ్‌డీ సెంటర్‌కు ఏర్పాటుకు ప్రభుత్వ ఆమోదం

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడంతోపాటు యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలను కల్పించే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చూసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అధికారులకు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన అధ్యక్షతన ప్రజాభవన్‌లో ఇండస్ట్రియల్ ప్రమోషన్ సబ్‌కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరైన ఈ సమావేశంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధితోపాటు ఇప్పటివరకు కుదుర్చుకున్న ఎంవోయూల అమలు, కొత్త పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇక నుంచి ప్రతీ శనివారం ఇండస్ట్రియల్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సమావేశాన్ని నిర్వహిద్దామని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతంలో హ్యుందాయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ స్థాపనకు సబ్‌కమిటీ ఆమోదం తెలిపింది. రూ.8,528 కోట్ల పెట్టుబడితో 675 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ ఆర్‌అండ్‌డీ కేంద్రం ద్వారా కొత్తగా 4,276 మంది యువతకు ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, డైరెక్టర్ మల్సూర్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ హరిత, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.